క్లుప్తంగా

తూతూమంత్రంగా మండల సమావేశం

కలువాయి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండడంతో అధికారులు హాజరుకాలేదు. దీంతో పలు శాఖల పై సమీక్ష జరగలేదు. వ్యవసాయం, వైద్యం, విద్యుత్, వెలుగు శాఖలపై మొక్కుబడిగా సమీక్ష నిర్వహించి మమా అనిపించారు. వైస్‌ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఏవో శివకుమార్, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



హరినాథ్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : మండలంలోని నందిమాలకు చెందిన మాజీ సర్పంచ్ హరినాథ్‌రెడ్డి(90) ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శనివారం నందిమాల గ్రామానికి చేరుకున్నారు. హరినాథ్‌రెడ్డి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాపాడి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నందుకు దాడి

సైదాపురం: అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నందుక తనపై దాడి చేశారని మండలంలోని తుమ్మలతలుపూరుకు చెందిన శ్రీనివాసులు చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను మాట్లాడుతూ తుమ్మలతలుపూరు సమీపంలోని చావతిప్ప వద్ద నిల్వ ఉన్న ఖనిజాన్ని శుక్రవారం రాత్రి శ్రీకాంత్ రవాణా చేస్తుండడంతో తాను అడ్డుకున్నానని తెలిపారు. దీంతో శ్రీకాంత్, అతని అనుచరులు తనపై దాడి చేశారని వాపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

ఓజిలి: మండలంలోని రాచపాళెం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం లారీని కారు ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం కర్లపూడికి చెందిన దంపతులు సూళ్లూరుపేట నుంచి కారులో బయలుదేరారు. రాచపాళెం క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డును క్రాస్ చేస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు, లారీను స్టేషన్‌కు తరలించారు.

బెదిరించి.. భయపెట్టి

- అప్రజాస్వామికంగా సాగునీటి సంఘాల ఎన్నికలు
- కూటమి నేతల బరితెగింపు
- యథేచ్ఛగా అధికార దుర్వినియోగం
- ఓటర్లను లోనికి రాకుండా అడ్డగింత
- కూటమి వ్యతిరేకుల నిర్బంధం
- తెలుగు తమ్ముళ్ల మధ్యే పోటీ



చిల్లకూరు : తొణుకుమాలలో పోలింగ్ కేంద్రంలోకి రాకుండా అడ్డుకోవడంతో బయటే ఉన్న ఓటర్లు



నాయుడుపేట మండలం పూడేరులో ఆందోళన చేస్తున్న ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి

చిల్లకూరు/ఓజిలి/కలువాయి/రాపూరు/దక్కిలి/కోట/పెళ్లకూరు/తడ/సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట రూరల్/వెంకటగిరి రూరల్ : సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పరిస్థితులు వివాదంగానే ఉన్నాయి. ఎన్నికలకు దూరంగా ఉన్న ట్టు వైఎస్సార్ సీపీ ప్రకటించినప్పటికీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఎక్కడ బయట పడుతుందోనని కూట మి నేతలు కుట్రలకు తెరలేపారు. పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి పోటీపడాలనుకున్న వారిని బెదిరించడం, భయపెట్టడం, అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారు. నీటి తీరువా చెల్లించేందుకు వచ్చిన రైతులకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకుండా పోయా రు. ఎన్నికల నిర్వహణ సమయాన్ని మార్పులు చేయడంతో సిబ్బంది తికమకపడ్డారు. కొన్నిచోట్ల కూటమికి బలం లేకపోయినా కుట్రలు చేసి ఎన్నికలను వాయిదా వేయించారు. వారికి అధికారులు వత్తాసు పలకడం చర్చనీయాంశమైంది.

- గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో శనివారం 105 చెరువులకు ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. అధికార పార్టీ నేతలు కుట్రలు చేసి ఏకగ్రీవం చేసుకున్నారు. చిల్లకూరు మండలం తొణుకుమాలలో పోటీ ఉంటుందని భావించి వెందోటి చక్రపాణిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోని పాఠశాలలో ఎన్నికలు జరుగుతుండగా ఓటర్లను లోనికి రాకుండా ఏకగ్రీవం చేసుకున్నారు. ఓడూరులో సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ భర్త, సుబ్బరాయులును పోలీసులు బెదిరించి ఎన్నికల్లో పాల్గొనకుండా చేశారు. కోట మండలం కొత్తపట్నంలో సీక్రెట్ ఓటింగ్ పెట్టాలని రైతులు పట్టుబట్టడంతో అధికారులు ససేమిరా అన్నారు. దీంతో అక్కడి రైతులు ఎన్నికలను బహిష్కరించారు.

ఉత్తమ నెల్లూరులో కూటమికి చెందిన బాబాయ్, అబ్బాయ్ పోటీ పడడంతో ఎన్నిక వాయిదా వేశారు.

జనసేనకు నామమత్రం.

కూటమి ప్రభుత్వంలో జనసేనకు నామమాత్రం ప్రాధాన్యమనే విషయం మరోసారి తేటతెల్లమైంది. గూడూరు నియోజకవర్గంలోని 105 చెరువులకు చెందిన అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికలో జనసేన నాయకులకు ప్రాధాన్యత లభించలేదు. ముందుగా ఎమ్మెల్యే జాబితా తీసుకున్నప్పటికీ తమ ప్రాభవం తగ్గిపోతుందని టీడీపీ నాయకులు భావించారు. సభ్యులుగా జనసేన నాయకులకు ఒకటి రెండు చోట్ల అవకాశం ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

- ఓజిలి మండలంలో 23 సాగునీటి చెరువులకు అధికారులు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ స్వప్న బందోబస్తు ఏర్పాటు చేశారు.
- కలువాయి మండలంలో 10 సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.
- సైదాపురం మండలంలోని 12 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా గిద్దలూరులోని రెండు సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగిలిన 10 సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. గిద్దలూరులో ఎన్నికల అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించి ఎన్నికను వాయిదా వేసినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. బలం లేకపోయినా సంఘాలను చేజిక్కించుకునే దురుద్దేశంతో కూటమి నేతలు వివాదాలు సృష్టించినట్టు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- రాపూరు మండలంలోని 8 చెరువులకు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు నోడల్ అధికారి సర్దార్ తెలిపారు.
- దక్కిలి మండలంలోని 18 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ శివశంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- పెళ్లకూరు మండలంలోని 19 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గంలో 141 సాగునీటి సంఘాలు ఉండగా 135 సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. దొరవారిసత్రం మండలంలో 36 సాగునీటి సంఘాల్లో 32 సంఘాలకు ఏకగ్రీవాలు చేసుకున్నారు. 4 సంఘాల్లో మేలుపాకలో ఒక వర్గం బలంగా వుండడంతో పోటీ గట్టిగా వుంది. తెలుగు తమ్ముళ్లు అధికారులను మేనేజ్ చేసి ఎన్నికను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలు చేయడంతో మరో వర్గం ఎన్నికల కేంద్రం వద్దే కూర్చున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కల్లూరు సంఘానికి ఎన్నికలు నిర్వహించినప్పటికీ లెక్కింపు చేయకుండా మేనేజ్ చేస్తున్నారు. ఇక్కడ పాత, కొత్త తెలుగు తమ్ముళ్లు నువ్వానేనా అంటున్నారు. పూలతోట, ఉచ్చూరు సంఘాల్లోనూ తెలుగు తమ్ముళ్లే పోటీ పడుతున్నారు. నాయుడుపేట మండలం పూడేరు సాగునీటి సంఘానికి ఒక వర్గం నామినేషన్ వేయకుండా టీడీపీ నేతలు అడ్డుకోవడంతో గొడవ జరిగింది. ఎంపీపీ కురు గొండ్ల ధనలక్ష్మీ నిరసన తెలిపి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. తడ మండలం కారూరులో వివాదం జరిగింది. పోటీ చేయాలనుకున్న వారికి ఫారాలు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. శిస్తు కట్టించుకోకుండా వీఆర్వో కూడా ఇబ్బంది పెట్టారు. దీనిపై ఇక్కడ వివాదం ఏర్పడడంతో పోలీసులు సర్దుబాటు చేసి టీడీపీకి పదవి కట్టబెట్టారు.
- సూళ్లూరుపేట మండలం కోటపోలూరులో హైడ్రామా చోటుచేసుకుంది. టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు ఎన్నికల కేంద్రానికి వచ్చారు. ఒక వర్గం వారిని నామినేషన్ పత్రాలు జిరాక్సులు కావాలని చెప్పి బయటికి పంపించారు. తర్వాత గేట్లు మూసేసి సమయం అయిపోయిందని చెప్పారు. అక్కడికి వచ్చిన రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.
- వెంకటగిరి మండలంలోని 30 సాగు నీటి సంఘాలు ఏకగ్రీవమైనట్టు ఈఈ బాబిరెడ్డి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని వెల్లడించారు.

డిజిటల్ విద్యకు ప్రోత్సాహం అభినందనీయం



డిజిటల్ స్క్రీన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు : పేద విద్యార్థులు విద్యను అభ్యసించేలా సరస్వతి శిశు మందిరంలో పెద్ద డిజిటల్ స్క్రీన్‌ను అందించేందుకు ముందుకు వచ్చిన ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు అభినందనీయుడని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో శనివారం డిజిటల్ స్క్రీన్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా ప్రదాతగా గుర్తింపు పొందిన పాతపాటి సుబ్రమణ్యం జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తన వంతుగా పేద విద్యార్థుల కోసం రూ.లక్ష అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి, పురుషోత్తం, బిల్లు చెంచురామయ్య, సనత్ కుమార్‌రెడ్డి, ఎస్ఎల్ఎన్ బాబు, పాదర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

గూడూరు రూరల్ : లోక్ అదాలత్‌లో సమయంతో పాటు డబ్బు ఆదా అయి సత్వరం కేసులు పరిష్కారమవుతాయని గూడూరులోని ఏడవ అదనపు జిల్లా జడ్జి షేక్ పర్వీన్ సుల్తానాబేగం తెలిపారు. గూడూరులోని కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించి పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో నాయమూర్తులు లోకనాథం, జయలక్ష్మీ, న్యాయవాదులు, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో 685 కేసులు..

సూళ్లూరుపేట రూరల్ : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనీల్‌కుమార్ తెలిపారు. సూళ్లూరుపేట కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 685 కేసులను పరిష్కరించినట్టు జడ్జి తెలిపారు.

నాయుడుపేటలో 1,631 కేసులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌ఆదాలత్‌లో 1,631 కేసులను పరిష్కరించినట్టు జడ్జి సంయుక్త తెలిపారు. క్రిమినల్ కేసులు 27, క్రిమినల్ కేసులు 53, ఎక్సైజ్ కేసులు 35, సివిల్ కేసులు 5, పెట్టీ కేసులు 1,511 ఉన్నట్టు తెలిపారు. బాధితులకు రూ.5,44,300 చెల్లించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు పనల గంగాప్రసాద్, బార్ మాజీ అధ్యక్షులు వేందోటి పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో 133 కేసులు..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 133 కేసులు పరిష్కరించినట్టు జడ్జి అనూష తెలిపారు. బాధితులకు రూ.40.75 లక్షలు చెల్లించినట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజారామ్, గాంధీ, రాజేష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.